న్యూజెర్సీ గవర్నర్‌తో నేడు సిఎం భేటీ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శుక్రవారం షెడ్యూల్ ఖరారైంది. ఉదయం 11 గంటలకు తాజ్‌ప్యాలెస్ హెూటల్ లో న్యూజెర్సీ గవర్నర్ ఫిలిప్ డి.మర్ఫీతో భేటీ కానున్నారు. ఉదయం 11.30గంటలకు బిజినెస్ స్టాండర్డ్ ఎడిటర్ మోడరేట్ చేసే 12వ వార్షిక ఫోరమ్‌లో ప్రసంగించనున్నారు. మధ్యాహ్నం 12 గంటలకు అమెజాన్, కార్ల్స్‌బర్గ్, కార్గెల్, గోద్రెజ్, ఉబెర్ కంపెనీల ప్రతినిధులతో పెట్టుబడులపై విడివిడిగా సమావేశం కానున్నారు. మధ్యాహ్నం 12.30 గంటలకు వరల్డ్‌ఎకనామిక్ ఫోరమ్ అధ్యక్షులు, సిఇవో, నార్వే మాజీ యూనియన్ మంత్రి బోర్జ్ బ్రెండేతో ముఖ్యమంత్రి ప్రత్యేకంగా భేటీ కానున్నారు.

దంచికొట్టిన వర్షం



- హైదరాబాద్‌లో నీటికుంటల్లా రహదారులు
- తీవ్ర ఇబ్బందులకు గురైన వాహనదారులు
- అప్రమత్తంగా ఉండాలి : మంత్రి పొన్నం ప్రభాకర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

హైదరాబాద్‌లో రెండో రోజూ వర్షం దంచికొట్టింది. గురువారం సాయంత్రం భారీ వర్షం కురవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వరద బీభత్సంతో రోడ్లు, కాలనీలు, లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. పలు ప్రాంతాల్లో 15 సెంటీమీటర్లకు పైగానే వర్షపాతం నమోదైంది. రోడ్లన్నీ చెరువులను తలపించాయి. ఈ సమయంలో వాహనదారులు తీవ్ర ఇక్కట్లు ఎదుర్కొన్నారు. సాయంత్రం విద్యార్థులు, ఉద్యోగులు ఇండ్లకు వెళ్లే సమయం కావడంతో తీవ్ర ఇబ్బందులు పడ్డారు. జూబ్లీహిల్స్, ఫిల్మ్‌నగర్, యూసుఫ్‌గూడ, అమీర్‌పేట్, మాదాపూర్ తదితర ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది. పంజాగుట్ట, ఖైరతాబాద్, లక్డీకాపూల్, నాంపల్లి, సెక్రటేరియట్, అబిడ్స్, కోఠి, హిమాయత్‌నగర్, ఎల్బీనగర్, ఉప్పల్, హయత్ నగర్ పరిసర ప్రాంతాల్లోనూ వర్షం పడింది. ఐటీ కారిడార్‌తోపాటు పలు ప్రాంతాల్లో ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. అత్యవసరమైతే తప్ప ప్రజలు బయటకు రావద్దని జీహెచ్‌ఎంసీ అధికారులు విజ్ఞప్తి చేశారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, వర్షపు నీరు ఇండ్లలోకి వచ్చేందుకు అవకాశముండటంతో జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

ప్రజలకు మంత్రి సూచన


నగరంలో భారీ వర్షం కురుస్తుండటంతో ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని హైదరాబాద్ ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ సూచించారు. లోతట్టు ప్రాంతాల్లో ప్రజలకు ఇబ్బందులు కలగకుండా జీహెచ్‌ఎంసీ, హైడ్రా, పోలీస్, విద్యుత్ వివిధ విభాగాల అధికారులు సమన్వయం చేసుకోవాలని చెప్పారు. మూడ్రోజుల్లో పడాల్సిన వర్షం 30 నిమిషాల్లోనే పడిందని, కుంభవృష్టి కురుస్తుండటంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయని చెప్పారు. అత్యవసరమైతే తప్ప ప్రజలు బయటకు రావొద్దని, లోతట్టు ప్రాంతాల ప్రజలు సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లాలని సూచించారు. ఎక్కడ ఇబ్బందులు ఉన్నా వెంటనే ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ బృందాలు స్పందించాలని ఆదేశించారు. మ్యాన్‌హెూల్స్ వద్ద జాగ్రత్త చర్యలు తీసుకోవాలని, జీహెచ్‌ఎంసీ సిబ్బంది నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. ఎక్కడైనా రోడ్లపై వర్షపు నీరు నిలిచి.. సమస్యలు ఉత్పన్నమైతే వెంటనే హైదరాబాద్ కలెక్టరేట్ హెల్ప్‌లైన్ నెం 9063423979కు, జీహెచ్‌ఎంసీ హెల్ప్ లైన్ నెం.040 2111 1111కు కాల్ చేసి సమాచారం అందించాలని అన్నారు.

నీట మునిగిన ప్రాంతాలను పరిశీలించిన హైడ్రా కమిషనర్

నీట మునిగిన ప్రాంతాలను హైడ్రా కమిషనర్ రంగనాథ్ పరిశీలించారు. హుస్సేన్‌సాగర్‌తోపాటు అమీర్‌పేట్‌లోని గాయత్రికాలనీ, మాదాపూర్‌లోని అమర్‌సొసైటీ, బాగ్‌లింగంపల్లిలోని శ్రీరాంనగర్‌తోపాటు వివిధ ప్రాంతాల్లో హైడ్రా కమిషనర్ పర్యటించారు. ఎగువ నుంచి వస్తున్న భారీ వరదతో మైత్రివనం వెనుక ఉన్న గాయత్రీనగర్‌కి ముప్పు ఉన్నట్టు గుర్తించారు. గాయత్రినగర్‌లోనూ నాలాలో సిల్ట్ తొలగించాలని స్థానికులు హైడ్రా కమిషనర్‌ను కోరారు. నాలాల్లో పూడిక తీసి శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని స్థానికులకు ఆయన హామీ ఇచ్చారు. దుర్గం చెరువులో నీటిమట్టం తగ్గించడంతో కొంతమేర పరిసర కాలనీలకు ముంపు సమస్య తీరనున్నట్టు హైడ్రా కమిషనర్ అభిప్రాయపడ్డారు. క్లౌడ్ బరస్ట్ కారణంగా గంట వ్యవధిలోనే 15 సెంటీమీటర్లకుపైగా వర్షం పడటంతో ఇబ్బందులు తలెత్తాయని స్పష్టం చేశారు.

లభ్యమైన మృతదేహం

భారీ వర్షానికి అఫ్జల్‌సాగర్ డ్రైనేజీలో ఆదివారం మామ, అల్లుడు కొట్టుకుపోగా.. వారిలో ఒకరి మృతదేహం లభ్యమైంది. నల్లగొండలోని మూసీ నదిలో అర్జున్ మృతదేహాన్ని సహాయక సిబ్బంది కనుగొన్నారు.



సిఎంకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎన్‌విఎస్ రెడ్డి

సిఎం రేవంత్ రెడ్డిని కలిసిన ఎన్‌విఎస్ రెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు (పట్టణ రవాణా)గా బాధ్యతలు స్వీకరించిన ఎన్‌విఎస్ రెడ్డి గురువారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిశారు. సిఎంకు పుష్పగుచ్ఛం అందించి కృతజ్ఞతలు తెలిపారు. నగర రవాణా వ్యవస్థను మరింత మెరుగుపరచడానికి తగు సలహాలు ఇవ్వాల్సిందిగా ఎన్‌విఎస్ రెడ్డికి ముఖ్యమంత్రి సూచించారు.

సామాజిక ఉద్యమంగా వనమహోత్సవం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

వన మహోత్సవ కార్యక్రమాన్ని ప్రభుత్వం సామాజిక ఉద్యమంగా కొనసాగిస్తోంది. జిల్లాలు, డిపార్టుమెంటుల వారీగా మొక్కలు నాటడంపై గురువారం హైదరాబాద్‌లోని సచివాలయంలో ఉన్నతాధికారులు సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. అటవీ, పర్యావరణ శాఖ ప్రిన్స్ పల్ సెక్రటరీ అహ్మద్ నదీమ్, పిసిసిఎఫ్ డాక్టర్ సువర్ణ ఈ సమావేశాన్ని నిర్వహించగా అన్ని విభాగాల అధికారులు పాల్గొన్నారు. ఇప్పటివరకు మొక్కలు నాటిన ప్రాంతాలకు జీయో టాగింగ్ పూర్తయినట్టు గుర్తించారు. ఈ ఏడాది 18.03 కోట్ల మొక్కలు టార్గెట్ పెట్టుకోగా... 13.84 కోట్ల మొక్కలు ప్లాంటేషన్ పూర్తి చేసినట్టు వివరించారు. 77 శాతం టార్గెట్ పూర్తి చేసినట్టు స్పష్టం చేశారు. అయితే, రాష్ట్రవ్యాప్తంగా పచ్చదనాన్ని మరింత విస్తరింప చేయాలన్న లక్ష్యంతో ప్రభుత్వం ప్రతి ఏడాది మొక్కలు పెంచే కార్యక్రమాన్ని వన మహోత్సవం పేరిట చేపడుతున్న విషయం తెలిసిందే. దీనిపై అటవీ అధికారులు పీపీటీనీ ప్రిన్స్ పల్ సెక్రటరీ, పిసిసిఎఫ్ వీక్షించారు. సమగ్రంగా వివరాలు అడిగి తెలుసుకున్నారు. గతేడాది అనుభవాల దృష్ట్యా మరింత పక్కాగా ఏర్పాట్లు చేయాలని సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా అటవీ విస్తీర్ణాన్ని పెంచేందుకు వన మహోత్సవం కింద పకడ్బందీ కార్యచరణ రూపొందించాలన్నారు. అన్ని జిల్లాల్లో.... అన్ని మండలాలు, గ్రామాలు, మున్సిపాలిటీల్లో పెద్దఎత్తున మొక్కలు నాటేందుకు కార్యాచరణ రూపొందించాలని ఆదేశించారు. ఈ సారి 100 శాతం లక్ష్యాన్ని పూర్తి చేయాలని మంత్రి సురేఖ ఆదేశించిన విషయాన్ని అధికారులు గుర్తు చేశారు.

అమీర్‌పేట్‌లో వాల్యూ జోన్ ప్రారంభం



ప్రజాశక్తి - హైదరాబాద్

నగరంలోని అమీర్‌పేట్‌లో వ్యాల్యూ జోన్ హైపర్ మార్కెట్‌ను ఏర్పాటు చేశారు. గురువారం దీనిని ఆ సంస్థ వ్యవస్థాపకులు శ్రీర్న రాజమౌళి, పొట్టి వెంకటేశ్వర్లు, టి ప్రసాద్ రావు లాంచనంగా ప్రారంభించారు. 75,000 చదరపు అడుగుల విస్తీర్ణంలో దీన్ని ఏర్పాటు చేశామని వారు తెలిపారు. ఇక్కడ జాతీయ, అంతర్జాతీయ బ్రాండ్లకు చెందిన విస్తృత శ్రేణీలో అన్ని వయస్సుల వారి ఫ్యాషన్ ఉత్పత్తులు, కిరాణ, హోమ్ నీడ్స్ లభిస్తాయన్నారు. 2000 పైగా ఉత్పత్తులపై ఒక్కటి కొంటే మరొక్కటి ఉచితంగా పొందవచ్చన్నారు. కుటుంబంలోని అన్ని తరాల వారిని దృష్టిలో ఉంచుకుని నాణ్యతలతో కూడా గొప్ప షాపింగ్ అనుభూతిని అందించేలా ఈ స్టోర్‌ను అందుబాటులోకి తెచ్చామన్నారు.



నిలోఫర్ ఆస్పత్రిపై ప్రత్యేక దృష్టి

- అధికారులకు మంత్రి దామోదర ఆదేశం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

నిలోఫర్ ఆస్పత్రిలో మౌలిక సదుపాయాల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించాలని వైద్యారోగ్య మంత్రి దామోదర రాజనర్సింహ అధికారులను ఆదేశించారు. నిలోఫర్ ఆస్పత్రిలో అన్ని విభాగాలను పటిష్టపర్చాలని దిశానిర్దేశం చేశారు. నిలోఫర్‌లో నూతన భవన నిర్మాణ పనులను శరవేగంగా పూర్తి చేయాలని సూచించారు. గురువారం హైదరాబాద్‌లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సచివాలయంలో నిలోఫర్ ఆస్పత్రి, ఆరోగ్యశ్రీ ట్రస్టుపై మంత్రి సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. పిజి విద్యార్థులకు ఆస్పత్రిలో హాస్టల్ వసతి కల్పించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రోగుల సహాయకులకు వసతి కల్పించాలని సూచించారు. రోగులకనుగుణంగా సిబ్బందిని నియమించాలని కోరారు. ఒపి, ఐపి వైద్య సేవలందిస్తున్న ఆస్పత్రుల భవనాల పరిస్థితులపై ఇంజనీరింగ్ అధికారులతో చర్చించారు. సమావేశంలో ఆరోగ్య శాఖ కార్యదర్శి డాక్టర్ క్రిస్టినా, టిజిఎంఎస్ఐడిసి వీణ, ఫణిందర్‌రెడ్డి, డిఎంఇ డాక్టర్ నరేంద్రకుమార్, అదనపు డిఎంఇ డాక్టర్ వాణి, నిలోఫర్ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ విజయ్‌కుమార్, ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

దసరాకు 7754 స్పెషల్ బస్సులు

377 సర్వీసులకు ముందస్తు రిజర్వేషన్ : ఆర్‌టిసి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

బతుకమ్మ, దసరా పండగల నేపథ్యంలో ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా టిజిఎస్‌ఆర్‌టిసి చర్యలు చేపట్టింది. ఈ నెల 20 నుంచి అక్టోబరు 2 వరకు రాష్ట్ర వ్యాప్తంగా 7754 ప్రత్యేక సర్వీసులను నడపాలని నిర్ణయించింది. ఈ మేరకు ప్రణాళికలు సిద్ధం చేసింది. అందులో 377 స్పెషల్ సర్వీసులకు ముందస్తు రిజర్వేషన్ సౌకర్యం కల్పించింది. పండక్కి సొంతూళ్లు వెళ్లినవారు తిరుగుపయనమయ్యేందుకు వీలుగా అక్టోబర్ 5, 6 తేదీల్లోనూ రద్దీకి అనుగుణంగా బస్సులు నడిపేందుకు సిద్ధమవుతోంది. హైదరాబాద్‌లో ప్రధానంగా ఎంజిబిఎస్, జెబిఎస్‌తో పాటు ప్రయాణికుల రద్దీ ఎక్కువగా ఉండే కెపిహెచ్‌బి, ఉప్పల్ క్రాస్‌రోడ్, ఉప్పల్ బస్టాండ్, దిల్‌సుఖ్‌నగర్, ఎల్బీనగర్, ఆరాంఘర్ తదితర ప్రాంతాల నుంచి ప్రత్యేక బస్సులను నడపనుంది. హైదరాబాద్, సికింద్రాబాద్ నుంచి రాష్ట్రం నలుమూలలతో పాటు ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, మహారాష్ట్రకు కూడా ప్రత్యేక సర్వీసులు నడపనుంది. పండగ స్పెషల్ బస్సుల్లో ప్రత్యేక ఛార్జీలు వసూలు చేయనున్నారు.

గతేడాది కంటే అదనంగా 617 బస్సులు: సజ్జనార్


"బతుకమ్మ, దసరా పండుగల దృష్ట్యా ప్రజలకు సురక్షితమైన, సౌకర్యవంతమైన ప్రయాణాన్ని అందించడానికి సంస్థ సిద్ధంగా ఉంది. గతేడాది కంటే అదనంగా 617 బస్సులను ఏర్పాటు చేస్తున్నాం. రద్దీ ప్రాంతాల్లో ప్రత్యేక క్యాంప్‌లను ఏర్పాటు చేసి ప్రయాణికులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నాం. రద్దీ ప్రాంతాల వద్ద పర్యవేక్షణ అధికారులను నియమిస్తున్నాం. ప్రయాణికుల రద్దీని బట్టి వారు ప్రత్యేక బస్సులను అందుబాటులో ఉంచుతారు. పోలీస్, రవాణా, మున్సిపల్ శాఖల అధికారులతో సమన్వయం చేసుకుంటూ..ప్రయాణికులను గమ్యస్థానాలకు చేర్చడమే లక్ష్యంగా అన్ని చర్యలు తీసుకుంటున్నాం" అని టిజిఎస్‌ఆర్టీసీ ఎండి విసి సజ్జనార్ తెలిపారు. పూర్తి సమాచారం కోసం టీజీఎస్‌ఆర్టీసీ కాల్ సెంటర్ నంబర్లు 040-69440000, 040-23450033ను సంప్రదించాలని సూచించారు.

రైతుల సంక్షేమానికి ఎమ్మెల్యే రూ. రెండు కోట్ల విరాళం

- సిఎంకు అందజేసిన ఎమ్మెల్యే బిఎల్‌ఆర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తన నియోజకవర్గంలో రైతుల సంక్షేమం కోసం నల్లగొండ జిల్లా మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి రూ. 2 కోట్ల విరాళాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి అందజేశారు. తన కుమారుడు సాయిప్రసన్న, కోడలు వెన్నెల రిసెప్షన్ ఘనంగా చేయాలని ఎమ్మెల్యే భావించారు. అయితే, రిసెప్షన్‌కు అంత ఖర్చు వద్దంటూ చెప్పి.. ఆ డబ్బులను రైతుల సంక్షేమం కోసం వినియోగించాలని కొడుకు, కోడలు కోరారు. దాంతో ఎమ్మెల్యే గురువారం కుటుంబ సభ్యులతో వెళ్లి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసి రూ.రెండు కోట్లు అందజేశారు. నియోజవర్గంలో లక్షమంది రైతులకు బస్తా యూరియా చొప్పున ఉచితంగా అందజేయాలని ముఖ్యమంత్రిని కోరినట్టు ఎమ్మెల్యే తెలిపారు. ఎమ్మెల్యే బిఎల్ఆర్ కుటుంబ సభ్యుల ఔదార్యాన్ని ముఖ్యమంత్రి ప్రత్యేకంగా అభినందించారు. వారి వెంట నల్లగొండ ఎంపీ కుందూరు రఘువీర్ రెడ్డి, బీఎల్అర్ సతీమణి మాధవి, కుమారుడు బత్తుల సాయి, ఈశ్వర్ రెడ్డి ఉన్నారు.



సిఎంకు చెక్ అందజేస్తున్న ఎమ్మెల్యే బిఎల్‌ఆర్

ఇవిఎంల భద్రత పట్ల జాగ్రత్తలు తీసుకోవాలి

- రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్‌రెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఇవిఎంల భద్రత పట్ల అధికారులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్‌రెడ్డి సూచించారు. గురువారం వికారాబాద్ పట్టణంలో ఆయన పర్యటించారు. జిల్లా కలెక్టరేట్‌కు చేరుకున్న ఆయనకు జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ పూల మొక్క అందజేసి స్వాగతం పలికారు. పోలీసులతో గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం జిల్లా కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలోని ఇవిఎం గోడౌన్‌ను కలెక్టర్ ప్రతీక్ జైన్, ఎస్‌పి నారాయణరెడ్డి, అదనపు కలెక్టర్ లింగ్యానాయక్‌తో కలిసి సుదర్శన్‌రెడ్డి పరిశీలించారు. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఈవీఎం గోడౌన్ సీల్‌ను తెరిచారు. ఇవిఎంలు, బ్యాలెట్ యూనిట్, కంట్రోల్ యూనిట్‌లు, ఎన్నికల సామగ్రిని భద్రపరిచిన గదులను క్షుణ్ణంగా పరిశీలించారు. సిసి కెమెరాల పనితీరును తనిఖీ చేశారు. ఈవీఎంల భద్రత విషయంలో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన సూచించారు. సంబంధిత రిజిస్టర్‌లను పరిశీలించి సంతకాలు చేశారు. ఈ సందర్భంగా వివిధ రాజకీయ పార్టీల నాయకులతో మాట్లాడారు. బిఎల్‌ఒల పేర్లు ఇచ్చారా? ఓటరు జాబితా పూర్తి అయినదా?, తదితర అంశాలపై పూర్తి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో తాండూర్ సబ్ కలెక్టర్ ఉమా శంకర్ ప్రసాద్, డిఆర్ఒ మంగీలాల్, ఆర్‌డిఒ వాసుచంద్ర, తహసీల్దార్ లక్ష్మీనారాయణ, ఎన్నికల విభాగం పర్యవేక్షకులు నెమత్ హాలీ, వివిధ రాజకీయ పార్టీల ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



ఇవిఎం గోడౌన్‌ను పరిశీలిస్తున్న ఎన్నికల అధికారి, కలెక్టర్ తదితరులు

నేను జగన్‌ను కలవడానికి వెళ్లడం లేదు..

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

"గుంటూరులో ఓ ప్రయివేటు కార్యక్రమానికి హాజరవ్వడానికి వెళ్తున్నా.. కానీ కొన్ని ఛానల్స్, సోషల్ మీడియాలో నేను మాజీ సీఎం జగన్మోహన్‌రెడ్డిని కలవడానికి వెళ్తున్నట్టు పుకార్లు సృష్టిస్తున్నాయి.. అది నిజం కాదు.. నా రాజకీయం, భవిష్యత్ గురించి ఏమైనా ఉంటే మీడియా సమావేశం పెట్టి చెబుతా.." అని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. నల్లగొండ జిల్లా చిట్యాల మండలంలోని పెద్దకాపర్తి సమీపంలోని ఓ హోటల్‌లో గురువారం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. తాను రాజీనామా చేస్తున్నానని, పార్టీ మారుతున్నానని, పార్టీ పెడుతున్నానని.. ఇలా రకరకాలుగా తప్పుడు వార్తలు రాస్తున్నారన్నారు. కొందరు గిట్టని వ్యక్తులు తన ప్రతిష్ట దెబ్బతీయడానికి సోషల్ మీడియా ద్వారా అవాస్తవాలు ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. దయచేసి పుకార్లను తెలంగాణ సమాజం నమ్మొద్దని విజ్ఞప్తి చేశారు.

శంషాబాద్‌లో హైడ్రా పంజా


ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ ఏజెన్సీ (హైడ్రా) రంగారెడ్డి జిల్లా శంషాబాద్‌లో పంజా విసురుతోంది. శంషాబాద్‌లోని బురుకుంట చెరువు ఎఫ్‌టిఎల్, బఫర్ జోన్‌లో వెలిసిన అక్రమ నిర్మాణాలను గురువారం హైడ్రా అధికారులు నేలమట్టం చేశారు. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. శంషాబాద్‌లోని అత్యంత ఖరీదైన ప్రదేశంలో 12 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న బూరుకుంట చెరువును రియల్ ఎస్టేట్ కబ్జా చేసి మట్టి పోసి నీళ్లు రాకుండా చేశారు. అందులో కొంత ఆక్రమించి నిర్మాణాలు చేపట్టారు. శంషాబాద్‌లోని అన్ని చెరువుల్లోకి నీళ్లు వస్తున్నా ఇక్కడ మాత్రం చెరువు ఆనవాళ్లు లేకుండా చుక్కనీరు రాకుండా రియల్ ఎస్టేట్ వ్యాపారులు ధ్వంసం చేయడంపై గతంలో వివిధ దినపత్రికల్లో అనేక కథనాలు వచ్చాయి. స్పందించిన హైడ్రా కమిషనర్ రంగనాథ్ చెరువుల పరిస్థితిని స్వయంగా పరిశీలించి, చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కొన్ని నెలల తర్వాత కమిషనర్ చెప్పినట్టుగానే ఇన్‌స్పెక్టర్ చిలుకురి తిరుమలేష్ నేతృత్వంలో భారీ బందోబస్తు మధ్య హైడ్రా రంగంలోకి దిగింది. ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లలో నిర్మించిన గోదాంలు, వాటర్ ట్యాంకులు, ప్రహరీ గోడలను జేసీబీలు, ప్రొక్లెయిన్లతో పూర్తిగా కూల్చేశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు కూల్చివేతల ప్రక్రియ కొనసాగింది. చెరువులో నిర్మించిన వ్యాపారులకు కోట్లల్లో ఆస్తి నష్టం జరిగింది. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ ఏఈ మౌనిక తదితరులు పాల్గొన్నారు.

రెండు ఆటోలు ఢీ.. ముగ్గురు మృతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రెండు ఆటోలు ఢీకొనడంతో ముగ్గురు ప్రాణం కోల్పోయారు. ఈ ఘటన గురువారం మహబూబ్‌నగర్ జిల్లా భూత్పూర్ మండలంలోని కొత్తమొల్గర సమీపంలోని తుల్జా భవాని తండా వద్ద జరిగింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఖిల్లాగణపూర్ మండలం నుంచి ప్రయాణికులను తీసుకొని మహబూబ్‌నగర్ వెళ్తున్న ఆటో తుల్జా భవాని తండా వద్ద ఎదురుగా వస్తున్న మరో ఆటోను ఢీకొట్టింది. ఈ ఘటనలో గట్టుకాడుపల్లి గ్రామానికి చెందిన వంశీ(24), హైదరాబాద్‌కు చెందిన సౌదరి నర్సింహారెడ్డి (56) అక్కడికక్కడే మృతిచెందారు. మానాజీపేటకు చెందిన సక్రి అనే మహిళకు తీవ్ర గాయాలయ్యాయి. ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గంమధ్యలో ఆమె మృతి చెందారు. మరికొందరికి గాయాలయ్యాయి. విషయం తెలిసిన వెంటనే భూత్పూర్ ఎస్ఐ చంద్రశేఖర్ తన సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. ప్రమాదంలో గాయపడిన వారిని అంబులెన్సుల్లో జిల్లా ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.



ఎసిబికి పట్టుబడిన ఎంఆర్ఐ, డిప్యూటీ సర్వేయర్

- రైతు నుంచి రూ.40 వేలు లంచం తీసుకుంటూ..

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

వనపర్తి జిల్లా కొత్తకోట తహసీల్దార్ కార్యాలయంలో ఎసిబి అధికారులు దాడులు నిర్వహించి ఎంఆర్ఐ, డిప్యూటీ సర్వేయర్‌ను రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. రూ.40 వేలు లంచం తీసుకుంటుండగా పట్టుబడ్డారు. కొత్తకోట మండలం నిర్విన్ గ్రామానికి చెందిన ఓ రైతు తన భూమిని పట్టా చేసి పాసుపుస్తకాలు ఇవ్వాలని ఆర్డీవోను ఆశ్రయించాడు. ఆర్‌డిఓ పరిశీలన కోసం తహసీల్దార్‌కు పంపారు. తహసీల్దార్ ఫీల్డ్ విచారణ చేసి స్థితిగతులపై నివేదిక ఇవ్వాలని ఎంఆర్ఐ వాసు, డిప్యూటీ సర్వేయర్ నవీన్‌రెడ్డిని ఆదేశించారు. వారిరువురూ రైతు దగ్గర రూ.40 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. డబ్బులు ఇస్తే ఆర్‌డిఓ, తహసీల్దార్ దగ్గర ఎలాంటి సమస్య రాదని అన్నీ తాము చూసుకుంటామని చెప్పారు. దీంతో సదరు రైతు ఎసిబి అధికారులను ఆశ్రయించారు. రైతు నుంచి వారు లంచం తీసుకుంటుండగా..ఎసిబి డిఎస్పీ సిహెచ్ బాలకృష్ణ ఆధ్వర్యంలో అధికారులు గురువారం దాడులు చేసి పట్టుకున్నారు. కేసు పూర్వాపరాలు విచారించి నిందితులపై చర్యలు తీసుకుంటామని ఎసిబి అధికారులు తెలిపారు.

రిసోర్స్‌పర్సన్స్ సమస్యలు పరిష్కరించాలి

- సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్
- కనీస వేతనం రూ.26వేలు అమలు చేయాలి : ఎస్ రమ



ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరవేస్తున్న రిసోర్స్‌పర్సన్స్ (ఆర్‌పీ) సమస్యలు వెంటనే పరిష్కరించాలని సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ ప్రభుత్వాన్ని కోరారు. హైదరాబాద్ ఇందిరాపార్క్ ధర్నాచౌక్‌లో గురువారం తెలంగాణ మెప్మా రిసోర్స్ పర్సన్స్ యూనియన్ (సిఐటియు) రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు ఆరు వేల మంది ఆర్‌పిలు దాదాపు రెండు దశాబ్దాలుగా పట్టణ పేదరిక నిర్మూలన సంస్థలో పనిచేస్తున్నారని తెలిపారు. మహిళలకు బ్యాంకు రుణాలు శ్రీనిధి నుంచి ఇప్పించడం, వాటిని తిరిగి సకాలంలో చెల్లించేలా చూడటం, మహిళల అభివృద్ధికి స్వయం సహాయక సంఘాలను ఏర్పాటు, మహిళలు ఆర్థికంగా సామాజికంగా ఎదగడానికి ఆర్‌పిలు చేస్తున్న కృషి అమోఘం అన్నారు. ఇన్ని పనులు చేస్తున్న వారికి రూ.ఆరు వేల వేతనమే అందుతోందని, శ్రమదోపిడీకి గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగిపోవడంతో చాలీచాలని వేతనాలతో కష్టంగా బతికీడుస్తున్నారన్నారు. ఆర్పీలకు కనీస వేతనం రూ. 26 వేలు అమలు చేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, రూ. పది లక్షల వరకు బీమా సౌకర్యం ఇవ్వాలని, ప్రత్యేక డ్రెస్ కోడ్, హెల్త్ కార్డులు, గుర్తింపు కార్డులు అందించాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించకపోతే పెద్దఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. యూనియన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు ఎస్.రమ మాట్లాడుతూ.. మున్సిపల్ పట్టణాల్లో సంఘాల పుస్తక నిర్వహణకు ఎంపికైన ఆర్‌పిలతో అనేక రకాల పనులు చేయించుకుంటున్నారని చెప్పారు. పట్టణ ప్రగతి కార్యక్రమం, చెత్త వేరు చేయడం, కంపోస్ట్ తయారీ, స్వచ్ఛ సర్వేక్షణ్, ఒడిఎఫ్ కార్యక్రమం, బతుకమ్మ చీరల పంపిణీ వంటి అన్ని కార్యక్రమాల్లో ఆర్పీలు కీలక పాత్ర పోషిస్తున్నారని వివరించారు. ఇన్ని పనులు కేవలం రూ.ఆరు వేల వేతనంతో చేస్తున్నారని, అది కూడా నెలల తరబడి పెండింగ్‌లో ఉండటంతో వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. కుటుంబాలు గడవలేక, అనారోగ్య సమస్యలు వెంటాడుతున్నాయని, కనీసం బీమా సౌకర్యం కూడా లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. పెరుగుతున్న ధరలకనుగుణంగా కనీస వేతనం రూ.26 వేలు నిర్ణయించి అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి పెండింగ్ వేతనాలు చెల్లించి వారిని ఆదుకోవాలని, రూ.పది లక్షల సాధారణ బీమా సౌకర్యం కల్పించాలని కోరారు. ఈ ధర్నాలో యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు చంద్రకళ, ఉపాధ్యక్షులు బాలమణి, కార్యదర్శి మంజుల, కోశాధికారి సుభద్ర, పద్మా, లావణ్య, ఉమా వసంత, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

గురుకులాల్లో విద్యా వ్యవస్థను పటిష్టం చేయాలి

- మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఎస్‌సి, ఎస్‌టి మైనారిటీ గురుకులాల్లో విద్యా వ్యవస్థను పటిష్టం చేయాలని సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అధికారులకు సూచించారు. గురువారం హైదరాబాద్‌లోని సచివాలయంలో ఆయన ఇదే అంశంపై ఉన్నత స్థాయి సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు.గురుకులాల విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడానికి అధికారులు సమాయత్తం కావాలన్నారు. ప్రయివేట్ భవనాల్లో కొనసాగుతున్న గురుకులాలకు తక్షణం కొత్త భవనాల నిర్మాణం, పాత భవనాలకు మేజర్, మైనర్ మరమ్మత్తులు తక్షణమే చేయించాలని ఆదేశించారు. తాత్కాలిక, దీర్ఘకాలిక ప్రణాళికలతో ముందుకెళ్లాలని సూచించారు..అధికారులంతా సమన్వయంతో పనిచేయాలని దిశానిర్దేశం చేశారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూసే బాధ్యత అధికారులపై ఉందని స్పష్టం చేశారు. డైట్ చార్జీలను ప్రభుత్వం పెంచిందనీ, విద్యార్థుల భవిష్యత్తు భద్రతకు ఇది ఒక ముందడుగని గుర్తుచేశారు. కేంద్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన సంక్షేమ నిధుల విషయంలో చురుకుగా అనుసంధానం చేయాలని సూచించారు. డ్రాప్‌అవుట్ రేటు తగ్గించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలనీ, మెంటర్‌షిప్, కౌన్సెలింగ్‌పై దృష్టి పెట్టాలని చెప్పారు. విద్యార్థుల స్కిల్ డెవలప్‌మెంట్, డిజిటల్ లెర్నింగ్, టెక్నాలజీ యాక్సెస్ పై ప్రత్యేక ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. ఉన్నత విద్య, జాతీయ ప్రవేశ పరీక్షల (జెఇఇ, ఐఐటి, ఎన్ఇటి, యుపిఎస్‌సి, ఎస్ఎస్‌సి) కోసం ప్రత్యేక కోచింగ్ సెంటర్లు ఏర్పాటు చేయాలని చెప్పారు. క్రీడలు, సాంస్కృతిక, వ్యక్తిత్వ వికాస కార్యక్రమాలు సమగ్రంగా అందేలా చూడాలన్నారు. వికలాంగులు, ట్రాన్స్‌జెండర్‌లకు ప్రత్యేక సదుపాయాలు కల్పించి, వారి అవసరాలకనుగుణంగా విధానాలు అమలు చేయాలని ఆదేశించారు. శాఖ ప్రత్యేక కార్యదర్శి సబ్యసాచి ఘోష్ పర్యవేక్షణలో సమావేశాన్ని నిర్వహించారు. సమావేశంలో సలహాదారులు, కార్పొరేషన్ చైర్మన్లు, అధికారులు కూడా పలు నిర్మాణాత్మక సూచనలు చేశారు. ఈ సమీక్షలో ఎస్‌సి, ఎస్‌టి, ఒబిసి మైనారిటీ శాఖల ప్రభుత్వ సలహాదారులు షబ్బీర్ అలీ, ముఖ్యమంత్రి ఓఎస్‌డి వేముల శ్రీనివాస్, ఎస్‌సి సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి జ్యోతి బుద్ధ ప్రకాష్, మహిళ, దివ్యాంగుల , సీనియర్ సిటిజన్ శాఖ ప్రత్యేక కార్యదర్శి అనితా రామ చంద్రన్, ఎస్‌సిడిడి కమిషనర్ క్షితిజ , మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఎండి క్రాంతి వెస్లీ, ఎస్‌సి గురుకుల కార్యదర్శి కృష్ణా ఆదిత్య, గిరిజన గురుకుల కార్యదర్శి సీతాలక్ష్మి, దివ్యాంగుల శాఖ డైరెక్టర్ శైలజ, మైనార్టీ గురుకుల కార్యదర్శి షఫియుల్లా పాల్గొన్నారు.



డబ్ల్యుహెచ్‌ఒతో మలబార్ గ్రూప్ ఒప్పందం

హైదరాబాద్ : సామాజిక బాధ్యత పట్ల తమ నిరంతర నిబద్ధతలో భాగంగా వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్ ఇండియాతో ఒప్పందం కుదుర్చుకున్నామని మలబార్ గ్రూప్ ఓ ప్రకటనలో పేర్కొంది. 'నర్చరింగ్ బిగినింగ్స్' అనే కొత్త సిఎస్ఆర్ చొరవను ప్రారంభించినట్లు పేర్కొంది. పట్టణ ప్రాంతాల్లో వెనుకబడిన వర్గాల తల్లులు, పిల్లలకు పోషకాహారం అందించడంతో పాటు, వారి శ్రేయస్సుకు మద్దతు ఇవ్వడానికి, పిల్లల మానసిక మరియు మేధో వికాసానికి మద్దతు ఇవ్వడానికి ఈ ప్రాజెక్ట్ మద్దతును ఇవ్వనుందని మలబార్ గ్రూప్ చైర్మన్ ఎంపి అహమ్మద్ తెలిపారు. ఈ ఒప్పందంలో వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్ ప్రతినిధి డాక్టర్ రోడెరికో హెచ్ పాల్గొన్నారు.

యాప్ డిజైన్ లీడర్‌గా హైదరాబాద్

- యుఎక్స్ ఇండియా కాన్ఫరెన్స్‌లో మంత్రి భట్టి



ప్రజాశక్తి - హైదరాబాద్

యాప్ డిజైన్ లీడర్‌గా హైదరాబాద్‌ను నిలిపేందుకు తెలంగాణ ప్రభుత్వం కృషి చేస్తుందని డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. గురువారం హైదరాబాద్‌లో యుఎంఒ ఫౌండేషన్ ఆధ్వర్యంలో "యుఎక్స్ ఇండియా 25" పేరిట ఏర్పాటు చేసిన 21వ ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ ఆన్ యూజర్ ఎక్స్‌పీరియన్స్ అండ్ ప్రోడక్ట్ డిజైన్" ను ఐటి శాఖ మంత్రి శ్రీధర్ బాబుతో కలిసి డిప్యూటీ సిఎం భట్టి లాంఛనంగా ప్రారంభించారు. హైదరాబాద్ ఎటువంటి టెక్నాలజీ నైనా అందిపుచ్చుకొని లీడర్‌గా ఎదుగుతుందని భట్టి విక్రమార్క అన్నారు. ఎఐ టెక్నాలజీకి హైదరాబాద్ మహా నగరాన్ని గ్లోబల్ సెంటర్ గా నిలబెట్టేందుకు సిఎం రేవంత్ రెడ్డి తో పాటు యావత్ క్యాబినెట్ పట్టుదలతో ఉందన్నారు. డిజైన్ అనేది కేవలం అందానికి కాదని సామాజిక మార్పునకు ఆయుధం కావాలన్నారు. తెలంగాణ ప్రభుత్వం సమానత్వం, అభివృద్ధిని ప్రోత్సహిస్తుందని తెలిపారు. హైదరాబాదును ప్రపంచ డిజైన్ క్యాపిటల్‌గా మార్చడానికి కలిసి పని చేద్దామని ప్రతినిధులకు డిప్యూటీ సీఎం పిలుపునిచ్చారు. ఈ అంతర్జాతీయ సదస్సు హైదరాబాద్ చరిత్రలో ఒక మలుపు రాయి అన్నారు. తెలంగాణ రాష్ట్ర డిజిటల్ భవిష్యత్తును పరిపుష్టం చేయడంలో, మరో అడుగు ముందుకు వేయడంలో కీలక పాత్ర పోషిస్తుందని తాను భావిస్తున్నట్లు తెలిపారు. భారతదేశంలో యుపిఐ వంటి యాప్‌లు సరళంగా రూపొందించడంతో పెద్ద విజయం సాధించాయన్నారు. ప్రాంతీయ భాషల్లోనూ యాప్ లు రూపొందించడం మూలంగా గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలు కూడా సులభంగా ఉపయోగించుకునే అవకాశం ఉంటుందన్నారు.

డిజైనింగ్‌కు పెద్దపీట వేస్తాం : మంత్రి శ్రీధర్ బాబు

హైదరాబాద్‌ను గ్లోబల్ డిజైన్ హబ్‌గా మార్చాలనే సంకల్పంతో త్వరలోనే "సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఇన్ డిజైన్"ను ప్రారంభించనున్నట్లు రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు చెప్పారు. టీ హబ్, టీ వర్క్స్, వీ హబ్ లాంటి సంస్థల ద్వారా తెలంగాణ ను ఇన్నోవేషన్ హబ్ గా మార్చేందుకు తమ ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తుందని వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా ఏర్పాటు చేయబోతున్న "ఏఐ ఇన్నోవేషన్ హబ్"లో డిజైనింగ్‌కు పెద్దపీట వేస్తున్నామన్నారు. డిజైనింగ్ అంటేనే సృజనాత్మకత అని, కాకపోతే ఆది యూజర్ ఫ్రెండ్లీగా ఉండాలన్నారు. అప్పుడే ఆ యాప్ లేదా వెబ్ సైట్ మనుగడ సాధ్యమన్నారు.

వరద నీటిలో కొట్టుకుపోయి యువకుడు మృతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

హైదరాబాద్ నగరవ్యాప్తంగా బుధవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి వరదలో కొట్టుకుపోయి యువకుడు మృతిచెందాడు. ఈ ఘటన బల్కంపేటలో జరిగింది. వివరాల్లోకెళ్తే.. భోలక్‌పూర్‌లో నివాసం ఉంటున్న షర్ఫుద్దీన్ బుధవారం రాత్రి పని ముగించుకొని ఇంటికి బైక్‌పై వస్తున్నారు. ఆ సమయంలో ఒక్కసారిగా భారీ వర్షం కురవడంతో బల్కంపేట రైల్వే బ్రిడ్జి కింద పెద్దఎత్తున వరద నీరు చేరింది. లోతు గమనించుకోకుండా ముందుకు వెళ్లడంతో వరద ప్రవాహం ఎక్కువై కొట్టుకుపోయారు. స్థానికులు గమనించి కాపాడే ప్రయత్నం చేసినా అప్పటికే యువకుడు మృతిచెందారు. పోలీసులు ఘటనా స్థలానికెళ్లి.. మృతదేహాన్ని గాంధీ ఆస్పత్రికి తరలించారు. భారీ వర్షాలు కురుస్తున్న సమయంలో ప్రజలు అత్యవసరమైతే తప్ప బయటకు రావద్దని పోలీసులు సూచించారు.



పవన్ మోటార్స్‌లో మారుతి విక్టోరిస్ విడుదల

- ఆవిష్కరించిన మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి

హైదరాబాద్ : దేశంలోనే అతిపెద్ద కార్ల తయారీ కంపెనీ మారుతి సుజుకి తన కొత్త విక్టోరిస్ కారును శేరిలింగంపల్లిలోని పవన్ మోటార్స్ షోరూమ్‌లో ఆవిష్కరించింది. గురువారం దీనిని రాష్ట్ర రోడ్స్ అండ్ బిల్డింగ్స్ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి విడుదల చేసింది. ఈ హైబ్రిడ్ మోడల్ లీటర్‌కు 28.65 కిలోమీటర్ల మైలేజీ ఇస్తుందని ఆ సంస్థ పేర్కొంది. ఈ కార్యక్రమంలో ఆ సంస్థ సౌత్ ఈస్ట్ జోన్ సిబిహెచ్ ఆర్ సురేష్ బాబు, పవన్ మోటార్స్ ఎండి కోమటిరెడ్డి చంద్ర పవన్ రెడ్డి పాల్గొన్నారు.

ట్విట్టర్ టిల్లు..! ముందు నీ ఇంటిని.. పార్టీని చక్కబెట్టుకో!!

- జూబ్లీహిల్స్ ఉపఎన్నికల్లో దమ్ముంటే నీ సత్తా చూపించు
- కెటిఆర్‌పై మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఫైర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

'ట్విట్టర్ టిల్లు.. ముందు నీ ఇంటిని, నీ పార్టీని చక్కబెట్టుకో.. మూడున్నరేండ్ల తర్వాత వచ్చే ఎన్నికల్లో నువ్వు అమెరికాలో ఉంటావా.. ఇండియాలో ఉంటావా అన్నది కూడా రాష్ట్ర ప్రజలకు సందేహమే' అంటూ బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్‌పై మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి విమర్శలు గుప్పించారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో కెటిఆర్ గెలుపుపై మంత్రి పొంగులేటి వార్నింగ్ ఇచ్చారు. పాలేరులో పొంగులేటి ఎలా గెలుస్తాడో చూస్తానంటూ కేటీఆర్ చేసిన వ్యాఖ్యలపై పొంగులేటి స్పందించారు. ఈ మేరకు గురువారం ఖమ్మంరూరల్ మండలం ఏదులాపురం మున్సిపాల్టీ పరిధిలోని వరంగల్ క్రాస్ రోడ్డులో జరిగిన పార్టీ కార్యక్రమంలో మంత్రి మాట్లాడారు. 'మీ నాయనే (కెసిఆర్) మూడుసార్లు పాలేరుకు వచ్చి ముక్కు నేలకేసి రాసినా నన్ను ఓడించలేకపోయాడు.. నువ్వెంత బచ్చాగాడివి..' అని ఆగ్రహం వ్యక్తం చేశారు. 'నా మీద నువ్వు నిలబడతావా? నా మీద నిలబడడం కాదు.. నీ మీద బచ్చగాన్ని పెట్టి గెలిపిస్తా'నంటూ కేటీఆర్‌పై విమర్శలు చేశారు. అయ్యా, కొడుకుల అహంకారపు మాటల వల్లే ప్రజలు బిఆర్ఎస్‌కు బుద్ధి చెప్పారని అన్నారు. మూడున్నరేళ్ల తర్వాత జరిగే ఎన్నికలనాటికి నువ్వు నిజంగానే ఇండియాలో ఉంటావో, బ్యాగూ, సంచీ సర్దుకొని విదేశాలకు చెక్కేస్తావో నిర్ణయించడానికి తెలంగాణా ప్రజలు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. దమ్ముంటే రానున్న జూబ్లీహిల్స్ ఉపఎన్నికల్లో మీ పార్టీ సత్తా చూపించండంటూ సవాల్ విసిరారు. అనంతరం వివిధ పార్టీలకు చెందిన 80 కుటుంబాలు కాంగ్రెస్‌లో చేరగా వారికి కండువాలు కప్పి ఆహ్వానం పలికారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, టిపిసిసి ప్రధాన కార్యదర్శి మద్దినేని బేబీ స్వర్ణకుమారి, రాష్ట్ర నాయకులు ధరావత్ రామ్మూర్తి నాయక్, బొర్రా రాజశేఖర్, మద్దులపల్లి మార్కెట్ కమిటీ చైర్మెన్ హరినాథ్ బాబు, పార్టీ మండల అధ్యక్షులు కళ్ళెం వెంకట్ రెడ్డి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



చైతన్య దీప్తి బోయి భీమన్న

ప్రజాశక్తి కల్చరల్

ప్రఖ్యాత రచయిత డాక్టర్ బోయి భీమన్న చైతన్య దీప్తి అని పలువురు వక్తలు కొనియాడారు. శ్రీ త్యాగరాయ గానసభ లోని కళా సుబ్బారావు కళా వేదికపై గాన సభ నిర్వాహణలో జరుగుతున్న ఎందరో మహానుభావులు కార్యక్రమ పరంపరలో భాగంగా గురువారం బోయి భీమన్న జయంతి ఉత్సవం జరిగింది. ముఖ్య అతిథిగా విశ్రాంత న్యాయమూర్తి డాక్టర్ పి సత్యనారాయణ ప్రసాద్ పాల్గొని మాట్లాడుతూ బోయి భీమన్న దళితులపై ఆకత్యాలను ఎండకడుతూ పాలేరు నాటకం రాసారని చెప్పారు. ఆ నాటకం నాడు ఎందరినో చైతన్య పరిచిందని గుర్తు చేశారు. ఆయన రాసిన గుడిసెలు కాలి పోతున్నాయి సుధీర్ఘ కావ్యంకి కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు వచ్చిందని అన్నారు. భీమన్న ప్రతిభ ను గుర్తించి ఆంధ్ర విశ్వవిద్యాలయం కళా ప్రపూర్ణ కేంద్రం పద్మ భూషణ్ అవార్డులు ప్రదానం చేశారని వివరించారు. గానసభ అధ్యక్షుడు కళా జనార్ధన మూర్తి అధ్యక్షత వహించిన వేదికపై సాహితీ కిరణం సంపాదకుడు పొత్తూరి సుబ్బారావు, సెన్సార్ బోర్డు సభ్యుడు టి చంద్రశేఖర్, కవి పెద్దూరి వెంకట దాసు, సంఘ సేవకుడు భవాని శ్రీనివాస పాల్గొన్నారు.

సురభి సంస్థకు స్తంభం అవేటి రఘునాథ్

ప్రజాశక్తి - కల్చరల్

వంద సంవత్సరాలు పైబడిన సురభి నాటక సంస్థ రంగస్థలంపై సాంకేతిక పరిజ్ఞానంలేని కాలంలోనే ఎన్నో ట్రిక్స్ చేసి తమ ప్రత్యేకత నిలుపుకుందని భాషా సాంస్కృతిక శాఖ సంచాలకుడు డాక్టర్ ఏనుగు నరసింహా రెడ్డి అన్నారు. ఇందుకు కారణమైన ఎందరో మహానుభావుల్లో రఘునాథ్ ఒకరు అన్నారు. ఆయన మృతితో సురభి సంస్థ గొప్ప ప్రతిభావంతునీ కోల్పోయిందని ఆయన నివాళి అర్పించారు. రవీంద్ర భారతి లోని సమావేశ మందిరంలో ప్రఖ్యాత సాంస్కృతిక సంస్థ చైతన్య ఆర్ట్స్ థియేటర్స్ నిర్వహణలో రఘునాథ్ సంస్కరణ సభ గురువారం జరిగింది. సంస్థ వ్యవస్థాపకులు కెకె రాజా మాట్లాడుతూ రంగస్థలంపై ఎంతటి కష్టమైనా రంగస్థల అలంకరణ లో రఘునాథ్ శ్రద్ధ చూపేవారని తెలిపారు. సురభి కళా కారులకి లింగంపల్లిలో ప్రభుత్వం ద్వారా నివాస గృహాలు ఇప్పించిన వారిలో రఘునాథ్ ముఖ్యులని తెలిపారు. ఆయన గొప్పనటుడు అని చెప్పారు. నృత్య గురువు కళాకృష్ణ, కథక్ అంజి బాబు సురభి కళా కారులు ఇతర నాటక సంస్థల వారూ పాల్గొని తమ నివాళి అర్పించారు.

ప్రోటోకాల్ వివాదం..!

- సిరిసిల్ల కలెక్టర్‌పై సర్కార్ సీరియస్
- 'షోకాజ్' నోటీసు జారీ చేసిన సిఎస్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రోటోకాల్ విషయంలో రాజన్న సిరిసిల్ల కలెక్టర్‌పై రాష్ట్ర ప్రభుత్వం సీరియస్ అయ్యింది. బుధవారం ప్రజా పరిపాలన దినోత్సవం సందర్భంగా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ప్రోటోకాల్ పాటించకపోవడాన్ని సర్కార్ తప్పుబట్టింది. జెండా ఆవిష్కరణ సమయానికి హాజరుకాకపోవడంతో పాటు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌కు స్వాగతం పలకడంలో కలెక్టర్ నిర్లక్ష్యం వహించారు. దీంతో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఈ విషయాన్ని సిఎంఒతో పాటు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి ఫిర్యాదు చేశారు. ఈ విషయమై రాతపూర్వకంగా వివరణ ఇవ్వాలని ప్రధానకార్యదర్శి కె రామకృష్ణారావు నోటీసులు ఇచ్చారు. అధికారిక కార్యక్రమంలో కలెక్టర్ నిబంధనలు పాటించకపోవడం వివాదాస్పదమైంది. సోమవారం మధ్యాహ్నం మూడు గంటల్లోగా వివరణ ఇవ్వాలని సిఎస్ ఇచ్చిన నోటీసుల్లో పేర్కొన్నారు. ఆయన ఇచ్చే వివరణ ఆధారంగా ప్రభుత్వం చర్యలు తీసుకునే అవకాశం ఉంది. ఇదిలావుండగా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా వరుస వివాదాలతో చిక్కుల్లోపడ్డారు. కోర్టు ధిక్కరణ విషయంలో తెలంగాణ హైకోర్టు వారెంట్ జారీ చేసిన విషయం తెలిసిందే.

ఒక భూ నిర్వాసితుడి విషయంలో కోర్టు బుధవారం వారెంట్ జారీ చేసిన విషయం తెలిసిందే. మిడ్ మానేరు ప్రాజెక్టు కింద ఇల్లు కోల్పోయిన చీర్లవంచ గ్రామానికి చెందిన వేల్పుల ఎల్లయ్య అనే నిర్వాసితుడికి పరిహారం చెల్లించలేదనీ, కోర్టు ఆదేశాలను పాటించలేదంటూ హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. కోర్టు ధిక్కరణ కింద కలెక్టర్‌కు నాన్ బెయిలబుల్ వారెంట్ జారీ చేసిన విషయం తెలిసిందే. తాజాగా ప్రభుత్వం నోటీసులు జారీ చేసింది. అయితే, బుధవారం జిల్లా పోలీస్ కార్యాలయ ఆవరణలో ప్రజాపాలన కార్యక్రమానికి కలెక్టర్ ఝా ఆలస్యంగా వచ్చారు. ముఖ్యఅతిథిగా వచ్చిన ఆది శ్రీనివాస్‌కు స్వాగతం పలికేందుకు కలెక్టర రాకపోవడంతో పాటు జెండా ఆవిష్కరణ సమయం వరకు అక్కడ లేకపోవడం వివాదానికి కారణమైంది.

చెరువులో పడి పంచాయతీ కార్మికుడు మృతి

- మృతుని కుటుంబాన్ని ఆదుకోవాలని సిఐటియు డిమాండ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

చెరువుకు సమీపంలో ఉన్న గ్రామపంచాయతీ బోరుబావిని మరమ్మతులు చేస్తూ, ప్రమాదవశాత్తు చెరువులో పడి పంచాయతీ కార్మికుడు మృతి చెందారు. ఈ ఘటన మెదక్ జిల్లా రామాయంపేట మండలం లక్ష్మాపూర్ గ్రామంలో జరిగింది. గ్రామంలోని ఊర చెరువు సమీపంలో ఉన్న బోరుబావికి మరమ్మతులు చేయడానికి వెళ్లిన పంచాయతీ కార్మికుడు అనుముల నర్సింలు ప్రమాదవశాత్తు చెరువులో పడి మృతి చెందాడు. సమీపంలో ఉన్న ఇతర కార్మికులు కాపాడడానికి ప్రయత్నించినా ఫలితం లేకుండా పోయింది. ఇతర కార్మికులు, స్థానికులు నర్సింలు మృతదేహాన్ని బయటకి తీశారు.

నర్సింలు కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ సిఐటియు ఆధ్వర్యంలో మృతదేహంతో రామాయంపేట ఎంపిడివొ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. విధినిర్వహణలో చెరువులో పడి మృతిచెందిన నర్సింలు కుటుంబానికి తక్షణమే ఆర్థిక సహాయం అందించాలని, కుటుంబంలో ఒకరికి శాశ్వత ఉద్యోగం కల్పించాలని జిల్లా అధ్యక్షులు బాలమణి డిమాండ్ చేశారు. గ్రామ పంచాయతీ కార్మికులు తమ ప్రాణాలను పణంగా పెట్టి గ్రామాలకు నీరు, పారిశుద్ధ్యం వంటి ప్రాథమిక సేవలను అందిస్తున్నారని, అయితే ప్రభుత్వం వారి భద్రతను నిర్లక్ష్యం చేస్తోందని ఆరోపించారు.


యుపి బృందం

పంచాయతీల్లోని ఆన్‌లైన్ సేవలపై యుపి బృందానికి అవగాహన

ప్రజావక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలోని గ్రామపంచాయతీల్లో ఆన్‌లైన్ ద్వారా అందిస్తున్న సేవలపై యుపికి చెందిన అధికారులు, ప్రజాప్రతినిధులకు అవగాహన కల్పించినట్టు జడ్‌పి సిఇఒ జానకీరెడ్డి తెలిపారు. సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ మండలం హుగ్గెల్లి గ్రామ రైతు వేదికలో తెలంగాణ గ్రామీణ అభివృద్ధి సంస్థలో శిక్షణ పొందుతున్న ఉత్తరప్రదేశ్‌కు చెందిన 30 మంది ప్రజాప్రతినిధులు, అధికారుల బృందం గురువారం ఉదయం పది గంటల నుంచి వివిధ గ్రామపంచాయతీల్లో చేపడుతున్న సంక్షేమ కార్యక్రమాలు, సేవలను పరిశీలించారు. ఈ సందర్భంగా సిఇఒ మాట్లాడుతూ.. గ్రామాల్లో ఆన్‌లైన్ ద్వారా ప్రజలకు అందుతున్న సేవల గురించి అవగాహన కల్పించామన్నారు. బర్త్ సర్టిఫికెట్, డెత్ సర్టిఫికెట్, గృహ నిర్మాణానికి అనుమతులు, తదితర పథకాలు, సేవలను ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవడం, వాటికి అనుమతులు ఇవ్వడం గురించి వివరించినట్టు చెప్పారు. ట్రైనింగ్ అధికారులు అనిల్ కుమార్, రాఘవేందర్ సవివరంగా వివరించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఎన్‌పిఒ అనిత, ఎంపిడిఒ మహేందర్ రెడ్డి, గ్రామపంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.